“అబ్బా!” పార్వతమ్మ నోటినుండి అప్రయత్నంగా వెలువడిన ఆ బాధా పూరితమైన కేక ఒక్కసారిగా ప్రతిధ్వనించింది తోటంతా.

బంగళా వరండాలో కూర్చుని కబుర్లాడుకుంటున్న విశ్వనాథంగారు, కొడుకు రామం గాభరాగా అటువైపు చూచారు ఒక్కసారే!

దూరాన ద్రాక్ష పందిరి వారగా కాలు పట్టుకుని కూర్చుండిపోయిన తల్లి కనిపించింది రామానికి. ఒక్క ఉదుటున పరిగెత్తాడక్కడికి.

అందాకా మొక్కలకు నీళ్ళు పెడుతూ, పాదులు సరిచేస్తున్న మాలి కూడా తన యజమాని పరిగెత్తడం చూచి, ఏమయిందోనని తనూ వచ్చాడు.

మొదలు నరికిన వృక్షంలా, కుప్పలా కూలబడి ఉంది పార్వతమ్మ! ఆమె పక్కనే వాలుగు ముద్ద మందారాలు కింద పడి ఉన్నాయి. బాగా లోతుగా దిగబడిన ముల్లు కొద్దిగా పైకి కనిపిస్తూంది అరికాలులోనించి.

“అయ్యయ్యో! ఎలా దిగబడిందమ్మా ముల్లు! ఉండుఉండు, నేను లాగేస్తాను.” అంటూనే తల్లి దగ్గిరగా కింద కూర్చుని ముల్లు లాగివెయ్యాలని చూశాడు రామం. కాని గోటికందలేదు.

పార్వతమ్మ గాభరాపడింది దూరాన ఒగరుస్తూ కోడలు సరళా, భర్త విశ్వనాథంగారూ, ఇంట్లోని నౌకర్లూ కూడా రావటం చూచి ఆమె మరింతగా కంగారు పడిపోయింది.


“అదే వస్తుందిలేరా, రామం! పిన్నుతో తీసేస్తాలే!” అంది లేవటానికి ప్రయత్నిస్తూ.

“అసలిక్కడికి ముళ్ళెలా వచ్చాయి, మాలీ? ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని నీకెన్నిమార్లు చెప్పాను? అమ్మ కాలిలో ఎంత పెద్ద ముల్లు దిగబడిందో చూశావా? అది నీ అజాగ్రత్త వల్ల జరిగింది” అంటూ మాలివీద విరుచుకు పడ్డాడు రామం.

మాలి ముఖం మాడిపోయింది! తెల్లారగానే పెద్దమ్మగారి మూలంగా తాను తిట్లు తినవలసి వచ్చిందన్నట్లు, తలగుడ్డ సరిచేసుకునే నెపంతో తల వంచుకున్నాడు.

పార్వతమ్మకా సన్నివేశం బాధ కలిగించింది.

“లేదురా, నాన్నా! అతగాడి తప్పేం లేదు. నేనే పనిమాలి ఈ పూలు కోద్దామని వచ్చి, చూడక అడుగు వేశాను” అంది.



-పవని నిర్మల ప్రభావతి


“ఊహూ” అలా నేరం నీ మీద వేసుకోకమ్మా! ఏం, సరళా! అమ్మకు ముద్ద మందారాలు సజ్జనిండా కోసి ఇవ్వకూడదూ? ఈ చదువుకున్న భార్యలతో ఇదే బాధ! ఇతర విషయాలలో ఉన్న ఆసక్తి ఇంటి విషయాలలో, స్వంత పనులలో ఉండద!”

సరళ ముఖం చిన్నబుచ్చుకుంది! “కాఫీ, టిఫిన్ సిద్ధంచేయిస్తూ, అత్తయ్యగారిలా వచ్చింది నే చూడలేదు!” అంది గొణుగుతూ.

పార్వతమ్మకు ముల్లు బాధకంటే, ఇందరి నిలా ఉదయాన్నే తన మూలాన చీవాట్లకు గురి చేయవలసి రావటం మరింత బాధాకర మనిపించింది.

“ఒరేయ్, రామం! ఏమిటా రభస! సరళేం కలగన్నదా నేనిలా వస్తానని.. అసలు ఇంట్లో నించి అడుగు బయటకు పెట్టని దాన్ని, నేనిలా ఉదయాన్నే ముద్ద మందారాలకోసం తోటలోకి రావట మేమిటి? ముల్లు దిగబడట మేమిటి? ముప్పిలా అందర్నీ కేకలెయ్యడ మేమిటి? అంతా కర్మ కాకపోతే! హడావిడి చెయ్యకు. ఇంట్లోకి వెళ్ళి పిన్నుతో కుట్టి తీసేస్తాను ముల్లు!” అంది మందలింపుగా.

అందాకా మౌనంగా ఉన్న విశ్వనాథం గారు, మెల్లిగా పార్వతమ్మ దగ్గిరగా వచ్చి చిరునవ్వు నవ్వారు. “పద! లోపలికి వెళదాం!” అన్నారు అనునయంగా. పార్వతమ్మ ...



ఆకులు - రేకులు ఫోటో — వై. విఠల్‌రావు (మద్రాసు-5?)

హృదయంలో ఏదో బాధ... మరేదో పన్నని జ్వాల ... చిన్న ముల్లులాంటి భావన కదలాడి ఆమెను ఆవేదనలో ముంచెత్తి వేస్తోంది...ఆ క్షణంలోనే ఆమె హృదయంలో రామం, అతగాడి ఐశ్వర్యం గుర్తు వస్తాయి.

'ఏ లోటూ లేని జీవనం, ఏ కొరతా లేకుండా తీరే కోరికలూ, ఏ క్షణంలో ఏది కావాలంటే అది అమర్చుకోగల ఆర్థిక స్థితిగతులూ రామంవి! అవి రవికి కూడా ఉండి ఉంటే ఎంత బాగుండేది?' అన్న భావన ఆమె హృదయంలో బలంగా నాటుకుంది.

ఆమెయికూ లయిదారు మార్లు రవిని కదిలించి చూసింది.

"రవీ! ఈ గొర్రెలోక ఆదాయాలకు నమస్కారం పెట్టి, నువ్వూ రామంలా ఏదేనా వ్యాపారం చూచుకోరాదుట్రా?"

తన ప్రశ్నలానే, జవాబులు కూడా ఒకే అర్థంతో మార్చి మార్చి చెప్పాడు రవి "ఆ వ్యాపారాలూ, పాడూ నాకు సరిపడని వమ్మా! న న్నిలా ఉండిపోనీ! ఇప్పుడేం? మేం హాయిగానే ఉన్నాంగా!" అంటూ! కానీ, తనకు హాయిగా లేదు! తన బిడ్డ లిద్దరికీ ఒక్కలా ముద్దు ముచ్చట్లు జరిపింది. ఒక్కలాటి బట్టలు కట్టబెట్టింది. చదువు సంధ్యలు చెప్పించింది. ఇద్దరి జీవితాలూ ఒక్కలా ఉండాలని ఆశించింది. దీవించింది. ఉన్నతంగా సాగిపోవాలని కాంక్షించింది!

కానీ, జరిగిందేమిటి?

ఒకడు అష్టైశ్వర్యాలతోన ఓల లాడుతూంటే, మరొకడు ఆర్థికమైన చిక్కులతో కటకటలాడుతున్నాడు. ఒకడి భార్యా, పిల్లలూ నీడ పట్టున కూర్చుని నిగ్గుతేలుతూంటే, మరొకని భార్యా, పిల్లలూ అలసటతో రంగుకోల్పోతున్నారు. ఎక్కడున్నదీ తేడా? ఎందుకు జరిగిందిలా?

ఆ ప్రశ్నే ఉండబట్టలేక భర్త నడిగింది.

ఆయనగారు నవ్వారు. "పిచ్చి పార్వతీ! లేనిపోని ఆలోచనలతో ఎందు కలా సతమత మవుతావు? అలా చూడు — నీ ఎదురుగా ఉన్న ఆ చెట్టు! స్థూలంగా చూస్తే ఆ చెట్టంతా ఒక్కలానే ఉంది కదూ! కానీ, సూక్ష్మదృష్టితో పరిశీలించి చూస్తే తెలుస్తుంది. ఆ చెట్టులోని ఏ ఒక్క కొమ్మా మరో కొమ్మను పోలి ఉండదు. ఏ ఒక్క రెమ్మా మరో రెమ్మను పోలి ఉండదు." ఆకు ఆకుకూ పోలికలు వేరు. మరి వాటన్నింటికీ ఆహారం సరఫరా అయ్యేది ఆ తల్లివేరు నుంచే కాదూ? మరెందుకు వచ్చిం దా తేడా!

"మనం చెప్పలేనివి, తెలుసుకోలేనివి కొన్ని విచిత్రాలు సృష్టిలో అంతటా నిండి ఉన్నాయి, పార్వతీ! వాటిల్లో ఇదీ ఒకటే!

"నీ రక్తం సమానంగా పంచి ఇచ్చావు అనురాగం సమంగా పంచావు. దీవెనల, సమంగా పంచావు. కానీ అదృష్టాలూ దురదృష్టాలూ, ఐశ్వర్యాలూ, లేములూ నీ చేతిలో ఉన్నవి కావు.

"మనం బిడ్డల అభివృద్ధికి మార్గదర్శకులమే గానీ, వారి అదృష్టాలకు మాత్రం కాదని గుర్తుంచుకో!"

భర్త చెప్పిన ఆ మాటలు ఆ కాస్సేపు ఊరట కలిగించాయేగానీ, మరుక్షణం నుంచీ తిరిగీ ముల్లులాటి ఆ భావన కదలాడుతూనే ఉంది. రవి దగ్గిరనించి రామం దగ్గిరికి వచ్చాక ... ఆ ముల్లు మరింత లోతుగా దిగబడింది. అనుక్షణం రవి, రవి ఆర్థిక పరిస్థితులూ గుర్తుకు వచ్చి ఆ ముల్లును అటూ ఇటూ కదిలించి వదలటం మొదలెట్టాయి. దాంతో ఆత్మ విమర్శ తలెత్తిందామెలో!

తను రామం ఐశ్వర్యం చూసి ఈర్ష్య పడుతూందా?

రవి కిలాటి పరిస్థితు లేవని కించ పడుతూందా? అందుకని, రామంకూడా రవిలా ఉండి ఉంటే తనకు శాంతిగా ఉండేదా? ఛీ... ఛీ... ఏమి టిది! కన్నతల్లిగా తను ఒక బిడ్డ ఐశ్వర్యం చూచి ఓర్వలేక పోతూందా? ఎంత దారుణం!

ఈ ఆలోచనలే ఆమెను ఉక్కిరిబిక్కిరి చేసివేయసాగాయి!

తన ఈ బాధ ఎవరితో చెప్పుకోగలదు? పరధ్యాన్నంగా ... ఇలా ఆలోచిస్తూనే నిన్న అలా వెళ్లి, ముల్లు మీద అడుగు వేసింది...

"పార్వతీ! లే... లే... స్టేషన్ వస్తూంది!" విశ్వనాథంగారు కంగారుగా లేపటంతో పార్వతమ్మ ఆలోచనల మగత విడిపోయింది.

గుబుక్కున లేచింది. కాలులో ముల్లు గుచ్చుకున్న భాగం కులుక్కుమంది క్షణకాలం...

* * *

నెల తిరక్కుండా పార్వతమ్మ మంచం పట్టింది. కారణం విడవని జ్వరం. కాలంతా పోటు...

విశ్వనాథంగారు చేతనైన నాటు వైద్యాలన్నీ చేయించారు. ఫలితం కనుపించలేదు.

"పిల్లల్ని పిలిపించనా?" అన్నారాయన భార్యవేపు అనునయంగా చూస్తూ.

"వద్దు... వద్దు... ఇప్పు డేమంత మునిగిపోయిందనీ వాళ్లని ఇబ్బంది పెట్టడం? వెధవది ఆ ముల్లు కాస్త సెలవేసినట్లుంది. అదే పోతుంది. మీరు కంగారు పడకండి..." అనే దామె!

కానీ, అలా పోలేదు...

సంగతి తెలిసి రామం, రవి రెక్కలు కట్టుకుని వాలారు. డాక్టరుకోసం తమ వెంట తలిదండ్రుల్ని పిలుచుకు వెళ్లారు... వద్దని వారించే స్థితిలో లేదు పార్వతమ్మ. మగతలో, మత్తులో ఉంది. కానీ, అప్పు డిక డాక్టర్లు చేయగలిగిందేమీ లేకపోయింది.

"కాలంతా సెప్టిక్ అయి, రక్తమంతా చెడిపోయింది. కాలు తీసివేసినా ఫలితం శూన్యం!" అని పెదవి విరిచేశారు డాక్టర్లు.

ఆ రోజు రాత్రే పార్వతమ్మ పనిపోయింది.

"నే నా రోజే డాక్టర్‌కు ఫోన్ చేస్తానంటే విన్నది కాదురా, రవీ, అమ్మ! ఆ ముల్లు అలా అమ్మ ప్రాణాలనే తీస్తుందని తెలిస్తే, బలవంతంగానైనా అమ్మను నా దగ్గరినించి కదలనిచ్చేవాణ్ణి కాను!" అన్నాడు ఏడుస్తూ రామం.

"ఊరుకో, అన్నయ్యా! ఎన్ని ముళ్లు... రోజూ ఎందరి కాళ్లలో గుచ్చుకోవటం లేదు? అందరూ చనిపోతున్నారా? కానీ, మృత్యువు ... ముల్లు రూపంలో కూడా రావటం... చిత్రంగా ఉంది నాకు!" లంటున్నాడు రవి...

ఇద్దరి మాటలూ వింటున్న విశ్వనాథంగారు మాత్రం గాఢంగా నిట్టూర్చారు. తరవాత పేలవంగా తనలో తను నవ్వుకున్నారు... ఆయన హృదయం ఇలా ఘోషించింది...

'మీకు తెలియదర్రా! మీ అమ్మ ప్రాణాలు తీసింది కాలిలో గుచ్చుకున్న ఆ చిన్ని ముల్లు కాదు... ఆమె హృదయంలో నాటుకున్న మరో ముల్లు. అది నాకు తప్ప ఎవరికీ కనిపించలేదు. కనిపించేది, తెలిసేది కాను కూడాను... కానీ, తెలిసినా నే నామె ఎదలో ముల్లును ఏ విధంగానూ తీయలేకపోయాను! ఎలా తీసివేయగలను! ఆ ముల్లు నేను తొలగింప గలిగింది కూడా కాదు!' ★